# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## కాంగ్రెస్ మాట వింటే కరెంట్ తీగలపై చద్దర్లు ఆరేయాల్సిందే



వ్యవసాయంపై అనుభవం లేని రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు రైతలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. తెలంగాణ రాక ముందు అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమైతే కరెంట్ ఉండదు, విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందే అన్నడు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే వారిచ్చే 3గంటల కరెంట్‌కు విద్యుత్ తీగలపై చద్దర్లు ఆరేయాల్సిన పరిస్థితి వస్తది. రేవంత్‌రెడ్డి ఓసారి రైతులకు 3గంటల కరెంటు చాలంటడు. ఇంకోసారి 10హెచ్‌పీ మోటర్లంటడు. ఆయనేం మాట్లాడుతడో ఆయనకే తెల్వదు. సీఎం కేసీఆర్ పాలనలో రైతులందరూ సుఖంగా ఉంటున్నరు. రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్‌తో పాటు నీరు పుష్కలంగా ఉన్నాయి. రైతులకు, అన్ని వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఈ ప్రభుత్వం ఎందుకు మార్వాలె. 10హెచ్‌పీ మోటర్ పెడితే ఖర్చు తడిసి మోపెడైతది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. ప్రసుత్తం బీఆర్‌ఎస్ పాలనలో సుఖంగా బతుకుతున్నాం. మా బతుకులను ఆగం చేయకు రేవంతూ.

– పత్తిపాటి నాగేందర్, వైకుంఠాపురం(గ్రా), నేరేడుచర్ల (మం)



‘వ్యవసాయానికి 24గంటల కరెంట్ వద్దు.. 3 గంటలు చాలు’ అని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై రైతాంగం కన్నెర్ర చేస్తున్నది. రైతులకు వ్యతిరేకంగా అడ్డగోలుగా వాగిన రేవంత్‌రెడ్డిపై మండిపడుతున్నది. స్వరాష్ట్రంలో ఇప్పుడిప్పడే పచ్చబడుతున్న రైతుల జీవితాల్లో నిప్పులు పోయాలనే కుట్రలను ఖండిస్తున్నది. 24 గంటల కరెంట్ సరఫరాను చూసి ఓర్వలేక అవగాహన లేమి ప్రకటనలు చేస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్నది. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఎట్ల సాల్తదని ప్రశ్నిస్తున్నది. ఎద్దు, ఎవుసం తెల్వకుండా ఎట్ల మాట్లాడుతరని ధ్వజమెత్తుతున్నది.

– మిర్యాలగూడ, నవంబర్ 21

# 3 గంటలు 3 మడులకు చాలదు

## కాంగ్రెస్ 3 గంటల కరెంట్ వ్యాఖ్యలపై రైతన్నల ఆగ్రహం

### వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటర్లు ఎక్కడన్నా ఉన్నాయా..?

**కాంగ్రెస్ నేతల తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు**

**24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్‌ఎస్‌నే గెలిపించుకుంటం అంటున్న అన్నదాతలు**

### 3గంటల కరెంట్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు ఫట్



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే వ్యవసాయానికి 3గంటలు కరెంట్ ఇస్తామంటుంది. 3గంటల కరెంట్ ఇస్తే రైతులు మోటార్లు ఒకేసారి ఆన్ చేస్తారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లపై ఎక్కువ మొత్తంలో లోడ్ పడుతుంది. దీంతో అవి కాలిపోయే ప్రమాదముంది. 3గంటల కరెంట్‌తో వ్యవసాయానికి 10హెచ్‌పీ మోటార్లు వాడితే భూగర్భ జలాలు అడుగంటి అవి కాలిపోతాయి. 10హెచ్‌పీ మోటార్లు కాలిపోతే వాటిని రిపేరు ఖర్చు సైతం అధిక మొత్తంలో అవుతుంది. 3గంటల కరెంట్ రాత్రి వేళల్లో ఇస్తే రైతులు రాత్రి పూట బావులు, బోర్ల వద్దకు వెళ్లి పాములు, తేలు కాటుకు గురై ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుంది. వ్యవసాయంపై అవగాహన లేకుండా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అమలైతే రైతులు, వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోతుంది. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంట్‌తో రైతులు తమ ఇష్టమొచ్చిన సమయంలో వ్యవసాయానికి నీరు పెట్టుకుంటున్నారు. 24గంటల కరెంట్ సరఫరాతో రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి చెందుతారు.

– సూరం లక్ష్మీకాంతరెడ్డి, సోలిపేట(గ్రా), సూర్యాపేట రూరల్

### నాడు పంటల సేద్యం.. అప్పులకే సరిపోయేది..

సీమాంధ్ర పాలనలో వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతులు అప్పులు చేసి సేద్యం చేసేవారు. కరెంట్ కష్టాలతో పంటలు సక్రమంగా పండక జిల్లా రైతులు ఆర్థికంగా అప్పుల ఊబిలో మునిగిపోయారు. నాడు సాగుకు మూడు, 4గంటల కరెంట్ ఇవ్వడం వల్ల, లో ఓల్టేజీ సమస్యతో మోటార్లు, స్టార్టర్లు, సర్వీస్ వైర్లు తరుచుగా కాలిపోయేవి. మోటార్లు కాలిపోయిన ప్రతిసారి రైతులకు రూ.2 వేలకు పైగా మరమ్మతు ఖర్చులయ్యేవి. ఇవేగాక స్టార్టర్లు, కేబుల్ వైర్లు, ఫీజులు కాలిపోవడం వల్ల మరో రూ.2వేల అదనపు భారం పడేది. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు ఉండడంతో అవి కాలిపోయి రైతులు మరమ్మతు కేంద్రాలకు తరలించాలంటే వేలాది రూపాయలు రైతుల మీద భారం పడేది. ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిన సందర్భంలో ఆ రోజుల్లో రైతులపై సుమారు రూ.10 వేల ఖర్చులు మీద పడేవి. అది టాన్స్‌ఫార్మర్ వెంటనే ఇవ్వకుండా రెండు, మూడు రోజులకు ఇచ్చేవారు. దీంతో పొట్టదశలో ఉన్న పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దాంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు సరిగా నీరు పారక దిగుబడులు అతి తక్కువగా వచ్చేవి. తీరా పంట అమ్మాక పెట్టిన ఖర్చులు పూడకపోగా అప్పులే మిగిలేవి.

### నేడు పండుగలా వ్యవసాయం

స్వరాష్ట్రంలో ఉద్యమ నేత కేసీఆర్‌కు ప్రజలు పట్టం కట్టడంతో స్వల్ప కాలంలోనే కరెంట్ కష్టాలను పారదోలాడు. 2014కు ముందు 3గంటల కరెంట్ సక్రమంగా ఇచ్చే పరిస్థితి లేకుండా ఉండేది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ అన్నదాతల కష్టాలను త్వరలో తీరుస్తానని రైతులకు మాట ఇచ్చి, ఇచ్చిన మాట మేరకు 2016 నుంచి వ్యవసాయ విద్యుత్‌ను 24 గంటల సరఫరా ప్రారంభించారు. మండలాల్లో విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా 33/11 విద్యుత్ సబ్ స్టేషన్లను నెలకొల్పారు. దీంతో నల్లగొండ జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ తొమ్మిన్నరేండ్లలో రైతులు బోరు బావులు ఏర్పాటు చేసుకుని కరెంట్ కనెక్షన్లు తీసుకున్నారు. 2014 మే వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1.46 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా నేడు కొత్తగా ఏర్పడిన నల్లగొండ జిల్లాలో 2.21లక్షల కనెక్షన్లు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 2014 మేలో 90,806 కనెక్షన్లు ఉండగా నేడు 1,46,336 కనెక్షన్లు పెరిగాయి. అలాగే 24 గంటల విద్యుత్ కారణంగా మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం వంటి సమస్యలకు చెక్ పడింది. రైతులు వానకాలం, యాసంగి పంటలు పండించుకోని అధిక లాభాలు గడిస్తున్నారు.

### కరెంట్ కోసం ధర్నాలు మాకొద్దు



సాగు చేసిన పొలం నీరు పారక ఎండిపోతుంటే ధర్నాలు చేసే రోజులు మళ్లీ మాకొద్దు. గతంలో కరెంట్ సరిగా లేక గంటకో పాలు ఎప్పుడొస్తదో అని ఎదురుచూసి చూసి కండ్లు కాయలు కాసేవి. యేడాదికి పది సార్లు మోటార్లు కాలిపోవడం బాగు చేయించుకోవడం జరిగేది. పంటలు పండించిన డబ్బులన్నీ మోటార్ల రిపేర్లకే అయ్యేవి. ప్రస్తుతం కాళేశ్వరం నీరొచ్చి మోటార్లతో పని లేకుండా పోయింది. ఎదురు చూడకుండా రెండు పంటలకు నీరు ఇస్తుండ్రు. సీఎం కేసీఆర్ సార్ 24గంటల కరెంట్ ఇవ్వడంతో ఏ రంది లేకుండా సాగు చేసుకుంటున్నం. పాత రోజులు మళ్లీ మాకొద్దు. 24గంటల కరెంట్‌తో రెండు సార్లు పంటలు పండిస్తున్నం. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు అలాంటి రోజులు మాకొదు. ప్రస్తుతం చూద్దామన్నా కరెంట్ పోయే పరిస్థితి లేదు.. మోటార్లు కాలిపోవుడు లేదు. 24గంటల కరెంట్‌తో నీళ్లు పుష్కలంగా అందుతున్నాయి. ఉన్న భూమి అంతా సాగు చేసుకుంటున్నం. మళ్లీ కేసీఆర్ సారే సీఎం కావాలి.

– హనుమ, రైతు, మూన్యానాయక్ తండా(గ్రా), చివ్వెంల(మం)

### రైతుల బతుకులు ఆగం చేయాలని కాంగ్రెసోళ్లు చూస్తుండ్రు



ప్రస్తుతం సీఎం కేసీఆర్ రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వడంతో పాటు, వ్యవసాయాన్ని, రైతులను కడుపుల పెట్టుకుని చూసుకుంటుర్రు. కాంగ్రెసోళ్లు అధికారంలోకొస్తే 3గంటల కరెంట్ ఇచ్చి, 10హెచ్‌పీ మోటార్లు పెట్టుకోమని రైతుల బతుకులను ఆగం చేయాలని చూస్తుర్రు. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఏ టైముకు వస్తదో తెలియక రైతులు బావులకాడ, బోర్లకాడ ఉండాల్సి వచ్చేది. రాత్రి పూట కరెంటొస్తే మోటారు పెట్టేందుకు పోయిన రైతులు పాము, తేలు కాటుకు బలై ఎందరో ప్రాణాలు పొగొట్టుకున్నరు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి రైతులకు 3గంటల కరెంట్ చాలని చెప్తుండు. 3గంటల కరెంట్‌తో రైతులు వ్యవసాయం చేయడం కష్టమే. కాంగ్రెసోళ్ల మాటలు వింటే రైతులు మళ్లీ ఆకలి చావులు, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తది.

– ఆవుదొడ్డి శ్రీశైలం, ఆరెగూడెం(గ్రా), సూర్యాపేట రూరల్